



జడ్చర్ల ప్రధాన రహదారిపై కుంటను తలపిస్తున్న వర్షపు నీటిలోనే వెళ్తున్న వాహనాలు

వానొచ్చె.. వరదొచ్చె..

- చెరువులను తలపించిన రహదారులు
- వర్షపు నీటితో స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడ్డ ప్రజలు, విద్యార్థులు

6

నిరుద్యోగులకు బాసటగా టీ గేట్

- లేబర్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖరం




ఐటీఐ కళాశాలలో మాట్లాడుతున్న చంద్రశేఖరం

పాలమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం టీగేట్‌తో నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోందని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆర్.చంద్రశేఖరం అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలను, ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్.చంద్రశేఖరం మాట్లాడుతూ కంపెనీలకు కావలసిన నైపుణ్యాలను ప్రతిపాదించటం కోసం మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్‌లను కుదించినట్లు తెలిపారు. ఐటీఐలో సీట్లు భర్తీ చేయటం, ఐటీఐ పూర్తి చేసిన వారికి శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్ ఇవ్వటం, కంపెనీలోనేరుగా ఉద్యోగం పొందేందుకు సహకారం అందజేయాలన్నారు. ఆయన వెంట పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస రావు, లేబర్ డిప్యూటీ కమిషనర్ ఎం.చంద్రశేఖర్‌గౌడ్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జంగయ్య, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ పి.మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లు ఒకరిది.. లోన్ మరొకరికి..

- మహమ్మదాబాద్ మండలంలోని 4 గ్రామాల్లో కొందరు అక్రమార్కుల ఆగడాలు
- అసెస్‌మెంట్ సర్టిఫికెట్లతో సేల్ డీడ్, ఆపై ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రుణాలు
- ఒక్కో లోన్‌పై 10 నుంచి 15 శాతం కమీషన్, అక్రమార్కులంతా పార్టీల నాయకులే
- ఇంటి పేరు, ఒంటిపేరు సరిపోలితే చాలు, ఫోర్జరీ సంతకాలతో కంపెనీల బురిడీ
- నకిలీ స్టాంపుల సృష్టి, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక డాక్యుమెంట్ రైటర్ తతంగం
- డాక్యుమెంట్ విలువ కంటే కూడా మూడు రెట్లు అధికంగా రుణాలు పొందిన వైనం





మహబూబ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా హౌజింగ్ ఫైనాన్స్ రెండు రకాలు ఉంటుంది. ఇల్లు కడుతున్న సమయంలో లోన్ ఇవ్వడం ఒక రకమైతే, ఇల్లు కట్టిన తర్వాత కూడా దాన్ని తనఖా పెట్టి రుణం పొందవచ్చు. రెండింటికీ ఇంటి రుణం పొందే వ్యక్తిపై ఉండాలి. కానీ కొందరు అక్రమార్కులు తమ నేర్పరితనంతో ఇల్లు లేకున్నా రుణాలు ఇప్పిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన సర్టిఫికెట్లను తీసి అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ఆ రుణాలను కాజేస్తున్నారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఈ తతంగం నడుస్తోంది. ఇప్పటివరకు 20 మందికిపైగా ఇళ్లు లేకుండానే లోన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. లోన్ తీసుకున్న వారికి ఇల్లు ఉన్నప్పటికీ లొకేషన్ రాకపోవడమో, లేదా ఆ ఇల్లు తండ్రుల పేరునో, అన్నదమ్ముల పేరునో ఉండటం వల్ల తన పేరుపై అన్ని నకిలీ పత్రాలు సృష్టించి వేరొకరి ఇంటి లొకేషన్, నెంబరు ఆధారంగా లోన్లు పొందుతున్నారు. తనకు రిస్క్ లేకుండా రుణాలు వస్తుండటంతో డబ్బులు కావాల్సిన వారు ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. ఇందులో వివిధ పార్టీల నాయకులు అక్రమార్కుల అవతారం ఎత్తగా మహబూబ్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీసు వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించి ఫోర్జరీ సంతకాలను యథేచ్ఛగా చేసేస్తున్నారు. ఈ పంచాయతీ యాప్ ద్వారా గ్రామాల్లోని ఇళ్లకు సంబంధించి అసెస్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించడం, దానిపై కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేయడం, నకిలీ స్టాంపులు సృష్టించడం లేదా కారోబార్‌లకు ఎంతోకొంత ముట్టజెప్పి స్టాంపులు వేసుకోవడం పరిపాటిగా మారింది. మహ్మదాబాద్ మండలంలోని గాదిరాల్, చౌదర్‌పల్లి, మంగంపేట, మహమ్మదాబాద్ తదితర గ్రామాల్లో ఆరు నెలలుగా ఈ దందా నడుస్తోంది.

రెండింతల రుణం...

సాధారణంగా సేల్‌డీడ్‌పై రుణాలు ఇచ్చే బ్యాంకులు వారి వార్షిక ఆదాయం, ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్, సేల్‌డీడ్ వాల్యూ ఆధారంగా 50 నుంచి 60 శాతం వరకు లేదా కొన్ని బ్యాంకులు కస్టమర్ ఆర్థిక స్థితిని బట్టి 90 శాతం వరకు సేల్ డీడ్ వాల్యూలో ఇస్తాయి. కానీ ప్రైవేటు హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల్లోని కొందరు ఫీల్డ్ ఆఫీసర్లు.. దాదాపు రెండు నుంచి మూడింతల వరకు సేల్ డీడ్ వాల్యూ కంటే ఎక్కువగా రుణం ఇస్తున్నాయి. ఈరారం అంజిలయ్య భార్య పేరు మీద చేసిన సేల్ డీడ్ విలువ రూ. 6.88 లక్షలు. కానీ ప్రైవేటు ఫైనాన్స్ దానిపై రూ. 13 లక్షల రుణం ఇచ్చింది. దీన్ని బట్టి లోన్ కోసం డాక్యుమెంట్లు తీసుకువచ్చి కస్టమర్ సంప్రదించే మధ్యవర్తి నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలు చేసే డాక్యుమెంట్ రైటర్, వాటిని బట్టి లోను మంజూరుకు సిఫారసు చేసే ఫైనాన్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ అందరూ కలిసే ఈ తతంగం నడుపుతున్నట్లు అర్థమవుతోంది. ఇదిలా ఉంటే ఇల్లు ఉండి పంచాయతీ కార్యదర్శి సంతకం పెట్టకపోయినా సరే ఫోర్జరీ సంతకాలు చేస్తూ లోన్లు ఇప్పిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై గాదిరాల్ పంచాయతీ కార్యదర్శి హాజీ ఎంపీడీవోకు ఇప్పటికే ఫిర్యాదు చేయగా మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో తన సంతకాల ఫోర్జరీ, నకిలీ అసెస్‌మెంట్ సర్టిఫికెట్ల సృష్టిపై ఫిర్యాదు చేయనున్నారు. ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో 11 మందికి, మరొక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఆరుగురికి ఈ మాదిరి ఫోర్జరీ డాక్యుమెంట్లతో లోన్లు ఇచ్చినట్లు తెలియగా ఇంకా కొన్ని ఫైనాన్స్ కంపెనీల వివరాలు బయటపడాల్సి ఉంది.

బయటకు వచ్చిందిలా...

మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌కు చెందిన ఇరువింటి అంజిలయ్యకు 2/2/22 నెంబర్‌తో ఇల్లు ఉన్నది. తనకు ఇంటి పని నిమిత్తం సర్టిఫికెట్ అవసరమై ఇటీవల ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి హాజీని సంప్రదించారు. వివరాలు పరిశీలించిన కార్యదర్శి ఇరువింటి అంజిలయ్య పేరుతో ఇల్లు లేదు కదా అని తేల్చాడు. అదేంటని ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే ఆ ఇల్లు సువర్ణ, భర్త ఈరారం అంజిలయ్య పేరుతో చూపెడుతోంది. అలాగే దానిపై సువర్ణ రూ. 13 లక్షలు లోన్ తీసుకున్నట్లు చూపెట్టింది. రికార్డుల్లో ఉన్న నెంబరు తీసుకొని ఆమె భర్త ఈరారం అంజిలయ్యను సంప్రదిస్తే తాను లోన్ తీసుకున్నానని, ఒక మధ్యవర్తి తనను లోన్ కావాలా అని అడిగాడని, అందుకోసం పంచాయతీ కార్యదర్శి వద్ద అసెస్‌మెంట్ సర్టిఫికెట్ తీసుకురావాలని అడిగితే తాను కార్యదర్శిని సంప్రదించానని చెప్పాడు. తన పేరు మీద కాకుండా తన తండ్రి పేరు మీద ఇల్లు ఉండటంతో కార్యదర్శి సంతకం పెట్టలేదన్నాడు. దీంతో తనకు సంతకం పెట్టడం లేదని మధ్యవర్తికి చెబితే అన్ని డాక్యుమెంట్లు తీసుకొని

(మిగతా 6లో..)

పేట చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

- మగ్గాలన్నింటికీ జియో ట్యాగ్ చేయించాలి
- చేనేత దినోత్సవంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్



చెక్కులను అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన నారాయణపేట చేనేత ఉత్పత్తులను ఆదరించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నేత కార్మికులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట చేనేత చీరలు ప్రపంచంలో ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదన్నారు. ప్రతీ మగ్గాన్ని జియో ట్యాగ్ చేయించాలన్నారు. చేనేత రంగం ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో చేనేత కార్మికుల స్థితిగతులు, మగ్గాలు, వారి సమస్యలపై ప్రత్యేక అధికారిని నియమించి పరిష్కారానికి త్వరలో కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. హౌసింగ్ స్కీమ్ ద్వారా వారి ఇళ్లకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైన కోటకొండ, చిన్న జట్రం కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవో రాంచందర్ మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను ఆదరించి, వాటికి మంచి పేరు తేవాలన్నారు. చేనేత సొసైటీ కోటకొండ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ.8 వేల పెన్షన్ ఇస్తుందని తెలిపారు. ప్రతీ మగ్గాన్ని జియో ట్యాగ్ చేసేలా కృషి చేయాలన్నారు. చేనేత పొదుపు చేనేత భరోసా కింద రూ.25,03,200 లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు గణప జ్ఞానదేవ్, సిల్క్ సంఘం అధ్యక్షుడు రమేష్, కళ్యాణి, విజయ్ కుమార్, బాబు, హ్యాండ్లూమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి

- చేనేత కార్మికుల ఆందోళన
- చేనేత దినోత్సవ సభలో నిరసన

7

ఒకే బెడ్‌పై నలుగురు రోగులు

- మద్దూరు సామాజిక ఆస్పత్రిలో ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా వైద్య విధాన పరిషత్ పరిధిలోకి రాని దవాఖానా
- అందరూ డిప్యూటేషన్‌పైనే విధులు...
- వైద్యం మెరుగు.. సౌకర్యాలు కరువు

6

సీఎం మాటకు విలువ ఉందా?

- భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షల్లో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్ రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోయే రైతులు అభివృద్ధికి సహకరించాలని, ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటకు విలువ ఉందా? అని బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. దామరగిద్ద మండలం కానుకుర్తిలో భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఒక్క ఎకరాకూ నీళ్లు అందని నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ఎందుకని ప్రశ్నించారు. పోలీసులతో, అధికారులతో రైతులను బెదిరించి భూములు లాక్కోవడమేనా ప్రజా ప్రభుత్వం అంటే అని ధ్వజమెత్తారు. ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుంటే భూ నిర్వాసితుల రైతులతో నారాయణపేటను దిగ్బంధం చేస్తామన్నారు. మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమే అని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మండలానికి సాగునీరు అందించి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వెంకట్‌రెడ్డి, అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి, బసంత్ రాజ్ పాల్గొన్నారు.

కంటతడి పెట్టిన కానుకుర్తి మాజీ సర్పంచు..

కానుకుర్తి మాజీ సర్పంచు శీలం బసిరెడ్డి మాట్లాడుతూ కొందరు కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తూ, రైతులను బెదిరించి సంతకాలు తీసుకుని అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. ఎకరాకు రూ. 50 లక్షల విలువ చేసే భూములకు రూ.14 లక్షలు ఇవ్వడం ఏంటని, తన ఒక్కని భూమి 18 ఎకరాలు పోతే ఎలా బతకాలని వేదికపై కంటతడి పెట్టడంతో అక్కడున్న రైతులందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

నాలుగు మార్కెట్ యార్డులు మంజూరు

» త్వరలో పాలక మండలి ఏర్పాటుకు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు

కొల్లాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 10 కొత్త మార్కెట్ యార్డులకు గురువారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో కొల్లాపూర్ నియోజకవర్గానికి నాలుగు మంజూరు కావడంతో రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డుతో పాటు అదనంగా నియోజకవర్గానికి 4 మార్కెట్ యార్డులు మంజూరు చేయాలని చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ... త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనుంది.

గతంలో కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు మండలాలకు కొల్లాపూర్ మార్కెట్ యార్డు పాలక మండలి ద్వారా రైతుల సంక్షేమం వ్యవసాయంపై పర్యవేక్షణ ఉండేది. కానీ కొత్తగా మంజూరైన నాలుగు మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు ప్రభుత్వ పాలన మరింత చేరువ కానుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కోడేరు మండలం పెద్దకొత్తపల్లి మండలం, వనపర్తి జిల్లా పరిధిలోని వీపనగండ్ల మండలం, పాన్‌గల్ మండలాల్లో మార్కెట్ యార్డులు మంజూరు కానున్నాయి. ఇప్పటికే కొల్లాపూర్ మార్కెట్ కమిటీకి కాబోయే చైర్మన్‌గా పట్టణ మాజీ సర్పంచ్ మాజీ కౌన్సిలర్ శ్రీదేవి పేరును, పెద్దకొత్తపల్లి మండలం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దండు నరసింహ పేరుతో పాటు వీపనగండ్ల మండలం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుదర్శన్ రెడ్డి పేర్లను మంత్రి జూపల్లి ఖరారు చేసిన విషయం తెలిసిందే. కోడేరు మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానం జనరల్ లేడీకి రిజర్వ్ కావడంతో పాన్‌గల్ మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానం ఎస్సీ జనరల్ లేడీ రిజర్వ్ కావడంతో త్వరలోనే చైర్మన్ అభ్యర్థుల పేర్లు ప్రకటించి మంత్రి వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ఇదిలా ఉండగా జిల్లా అధికారుల ఆదేశానుసారం నూతనంగా మార్కెట్ యార్డులు మంజూరైన ఆయా మండలాల్లో నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులు స్థల సేకరణ చేసేందుకు నిమగ్నమయ్యారు. కొల్లాపూర్ నియోజకవర్గ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న నిధుల ద్వారా నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన నాలుగు మండలాలకు నిధులు కేటాయించనున్నారు.

రిజర్వాయర్ కాలువలో సిల్ట్ తొలగింపు



భూత్పూర్ రిజర్వాయర్ కాలువలో సిల్ట్, జమ్మును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అమరచింత, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భూత్పూర్ రిజర్వాయర్ కాల్వలో (సిల్ట్)జమ్మూ తొలగించే పనులను గురువారం చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు గత నాలుగు రోజుల క్రితం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర హైకోర్టు మాజీ అడ్వకేట్ జనరల్ సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్‌రెడ్డి సొంత వ్యయంతో భూత్పూర్ రిజర్వాయర్ కాలువలో కూరుకుపోయిన జమ్మూ తీసే పనులను ప్రారంభించారు. ఈ పనులను డీఈ సతీష్ కుమార్, ఏఈ బాలకృష్ణ, రాఘవేందర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఫారుక్, భాస్కర్‌లు పర్యవేక్షించారు. జక్కనపల్లి గ్రామం నుంచి క్రామేడ్పల్లి అమరచింత పిన్నంచర్ల వరకు కూరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులను ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రైతులకు ఇచ్చిన హామీ మేరకు సొంత వ్యయంతో సిల్ట్ తీసివేయడం సంతోషించదగ్గ విషయమని పలువురు రైతులు పేర్కొన్నారు. అధికారులతో పాటు రైతులు వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, శివన్న పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

» జీహెచ్‌ఎం వంట ఏజెన్సీపై గ్రామస్థుల ఆగ్రహం

» ఆలస్యంగా విద్యార్థులకు భోజనం


జీహెచ్‌ఎం సరస్వతిని నిలదీస్తున్న గ్రామస్థులు

మిడ్జిల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సకాలంలో భోజనం ఎందుకు పెట్టలేదని మిడ్జిల్ గ్రామస్థులు గురువారం పాఠశాల వద్దకు తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలితో కలిసి వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను జీహెచ్‌ఎం సరస్వతి దురుసుగా మాట్లాడుతుందని, తమను చెప్పరాని పదజాలంతో దూషిస్తుందని, బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో విద్యార్థులకు వంట ఏర్పాటు చేయడంలో ఆలస్యమైందని వంట ఏజెన్సీ వారు సమాధానమిచ్చారు. రెండు నెలలుగా గుడ్లు, మెనూ ప్రకారం వంట ఏర్పాటు చేయడం లేదని జీహెచ్‌ఎం సరస్వతి తెలిపారు. రెండు నెలలుగా మెనూ ప్రకారం వంట విద్యార్థులకు పెట్టకపోతే మీరేం చేస్తున్నారని గ్రామస్థులు జీహెచ్‌ఎంను ప్రశ్నించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయకుంటే పై అధికారులకు ఫిర్యాదు చేసి కొత్తవారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థులు వెంకటయ్య, బాల్‌రెడ్డి, శంకర్, రాముగౌడ్‌తో పాటు తదితరులున్నారు.

ఇల్లు ఒకరిది.. లోన్ మరొకరికి..

(5వ పేజీ తరువాయి)

తాను లోన్ ఇప్పిస్తానని, తనకు కమీషన్ ఇవ్వాలని సూచించగా తన పేరుపై ఏం లేకున్నా లోన్ ఇస్తున్నారని ఓకే చెప్పారు. మహబూబ్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీసు వద్ద ఉన్న ఒక డాక్యుమెంట్ రైటర్ ద్వారా నకిలీ పత్రాలు సృష్టించారని తెలిసింది. కారోబార్‌కు కొంత డబ్బు ఇస్తే స్టాంపులు వేశారని మధ్యవర్తి చెబుతున్నారు. డాక్యుమెంట్ రైటర్ అసెస్‌మెంట్ సర్టిఫికెట్ తీసుకొని స్టాంపులు వేయించి ఫోర్జరీ సంతకాలు చేయించి తనకు పరిచయం ఉన్న ఓ ప్రైవేటు హౌజింగ్ ఫైనాన్స్ నుంచి రూ. 13 లక్షల లోన్ ఇప్పించారు. కమీషన్ 15 శాతం మధ్యవర్తులకు ముట్టగా మొత్తం రుణానికి ప్రస్తుతం వాయిదాలు ఈరారం అంజిలయ్య చెల్లిస్తున్నాడు. అయితే ఈరారం అంజిలయ్యపై ఇల్లు లేకపోవడంతో ఈ ఇనిషియల్ వస్తున్న ఇరువింటి అంజిలయ్య ఇంటి అసెస్‌మెంట్ సర్టిఫికెట్ ద్వారా సువర్ణకు మ్యూటేషన్ చేస్తున్నట్లుగా సేల్ డీడ్ సృష్టించారు. దాని ప్రకారం ఇరువింటి అంజిలయ్య ఇంటిపై ఈరారం అంజిలయ్య భార్య సువర్ణకు ప్రైవేటు హౌజింగ్ ఫైనాన్స్ నుంచి రుణం మంజూరైంది. ఒకవేళ ఈరారం అంజిలయ్య రుణం డబ్బులు చెల్లించకపోతే ఇరువింటి అంజిలయ్య బాధ్యుడయ్యే పరిస్థితి ఉంటుంది. మహబూబ్‌నగర్ కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు ప్రైవేటు హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఫీల్డ్ ఆఫీసర్ల ద్వారా మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్ ఈ తతంగం నడిపిస్తున్నారు.

ఒకే బెడ్‌పై నలుగురు రోగులు

● మద్దూరు సామాజిక కేంద్రంలో ఇబ్బందులు



మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం

» పెరుగుతున్న రోగుల సంఖ్య

» ఏళ్లు గడుస్తున్నా వైద్య విధాన పరిషత్ పరిధిలోకి రాని వైనం

» అందరు డిప్యూటేషన్లపైనే విధులు..

మద్దూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల పరిధిలోని వందకు పైగా గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉన్న మద్దూర్ ఆసుపత్రికి రోజూ వందలాది మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మద్దూర్‌లో సామాజిక ఆరోగ్య కేంద్రం అవసరంగా భావించి గత ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నది. ఈ క్రమంలో ఆసుపత్రి భవన నిర్మాణం మాత్రమే చేసిందే కాని వైద్య విధాన పరిషత్ పరిధిలో తీసుకురాలేకపోయింది. దీంతో నాటి నుంచి పేరుకే సామాజిక ఆరోగ్య కేంద్రం. కానీ, ఆ స్థాయిలో వైద్యుల నియామకానికి అర్హతకు నోచుకోక పోయింది.

మారుమూల ప్రాంతంలో పేదలకు మౌళిక సదుపాయాల కల్పనకు ఓ ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో మద్దూర్ ఆసుపత్రికి స్కానింగ్ పరికరంతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చినా అవి వినియోగానికి నోచు కోలేదు. దీంతో కరోనా సమయంలో స్కానింగ్ పరికరాన్ని పైఅధికారులు మక్తల్ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పైనే వైద్యుల నియామకం...

మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ పోస్టులు భర్తీ కాకపోవడంతో ప్రభుత్వం డిప్యూటేషన్ పైనే వైద్యుల నియామకానికి చర్యలు తీసుకొంది. మొత్తం ఆరుగురు వైద్యులను, 11 మంది నర్సులు, ఓ హెడ్ నర్సు ఉన్నారు.

రోజు వందల సంఖ్యలో రోగులు

మద్దూర్‌కు పరిసర మండలాలైన దౌల్తాబాద్, కోయిల కొండ, దామరగిద్ధ, నారాయణపేట, కొత్తపల్లి మండలాల శివారులోని పలు గ్రామాల ప్రజలకు మద్దూర్ ఆసుపత్రి అనువుగా ఉంటుంది.

దీంతో రోజుకు వందలాది మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. దీంతో రోగులతో ఆసుపత్రి కిట కిలాడుతోంది.

ప్రభుత్వం దృష్టితో మెరుగైన సేవలు...

ముఖ్యమంత్రి నియోజక వర్గం పరిధిలో ఉన్న మద్దూర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేలవలందుతున్నాయని చాలా మంది రోగులు మద్దూర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. నిత్యం రోగులతో ఆసుపత్రి కిటకిలాడుతోంది.


ఒకే బెడ్‌పై ఉన్న రోగులతో వారి బంధువులు

ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి తీసుకురావాలి

కొడంగల్, పేట నియోజకవర్గాల్లోని పలు మండలాల పరిసర గ్రామాల ప్రజలకు మద్దూర్ ఆసుత్రిని అనువుగా ఉండటంతో రోజూ వందలాది మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. మారుమూల గ్రామాలున్న ప్రాంతాలకు అనువుగా ఉన్న మద్దూర్ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకు రావడమే కాకుండా 30 నుంచి 100 పడకలకు స్థాయిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నంతలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం



మద్దూర్ ఆసుపత్రిని వైద్యావిధాన పరిషత్‌పరిధిలో లేని కారణంగా పోస్టుల భర్తీకి జాప్యం జరుగుతోంది. డిప్యూటేషన్‌పై వైద్యులు విధులు నిర్వర్తిస్తూ ఉన్నంతో మెరుగైన సేవలందిస్తున్నాం. 24గంటల పాటు షిఫ్టు విధానం వైద్యులు అందుబాటులో ఉంటున్నారు.

– డాక్టర్ పావని, ఇన్‌చార్జి, సుపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం

ప్రజా వర్గ పోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పాలమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో సామ్రాజ్యవాద బృందానికి అమెరికా దేశం నాయకత్వం వహిస్తోంది. ప్రజావర్గ పోరాటాలతోనే పార్టీని విస్తరిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం రష్యానుంచి ఆయిల్ కొనుగోలు చేయరాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధిస్తూ 50 శాతం సుంకాలు విధించటాన్ని సీపీఎం ఖండిస్తుందన్నారు. ఒక దేశ సార్వభౌమత్వంలో అమెరికా పెత్తనాన్ని సహించమన్నారు. దీనివల్ల వ్యవసాయం, ఫార్మా తదితర రంగాల్లో తీవ్ర సంక్షోభం ఏర్పడుతుందన్నారు. దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ విదేశాంగ విధానాన్ని ప్రకటించాలన్నారు. పార్లమెంటులో అమెరికా పట్ల తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

బీహార్ ఎన్నికల్లో 62లక్షల ఓట్లను తొలగించి, ఇందులో ప్రతిపక్షాలని మైనారిటీల ఓట్లను తొలగించడం పట్ల తీవ్రంగా ఖండించారు. మళ్లీ బీజేపీ, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటానికి ఎలక్షన్‌లను ఉపయోగించుకుని 65 లక్షల ఓట్లు తొలగించడంపై సుప్రీంకోర్టు ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. అయినా మోదీ ప్రభుత్వానికి కనువిప్పు కలుగలేదన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు పరచాలని కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లుపెట్టి కేంద్రానికి పంపినా ఆమోదించడం లేదన్నారు. దీనివల్ల స్థానిక ఎన్నికలు వాయిదా పడుతాయని ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా తిరస్కరించటం సరికాదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. 8,9వ తేదీలలో తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రజా సమస్యలు తీసుకుని పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఏ రాములు, కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, వి.పద్మ, చంద్రకాంత్, వేణుగోపాల్, ఆర్.రాంరెడ్డి, వల్లభాపురం జనార్దన్, ఖమర్‌అలీ, ఖాజామైనుద్దీన్, ఖయ్యూం, చంద్రమ్మ, నాగమణిలు పాల్గొన్నారు.



జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పకడ్బందీగా డిజిటల్ నేరాల నియంత్రణ

» ఆర్‌బీఐ సీజేఎం సుబ్బయ్య


డిజిటల్ ఫ్రాడ్స్ అవేర్‌నెస్ బ్రోచర్లను విడుదల చేస్తున్న సీజేఎం, ప్రిన్సిపాల్

గద్వాల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఆన్‌లైన్ సేవల్లో డిజిటల్ నేరాలను నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ (అంబుడ్స్‌మెన్)సుబ్బయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌మిషన్ సహకారంతో ఫైనాన్సియల్ లిటరసీ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య మాట్లాడుతూ డిజిటల్ నేరాలు జరుగుతున్న తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అదేవిధంగా ప్రతీ ఖాతాదారుడు జన సురక్ష కాంపెయిన్‌లో భాగంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనరల్ మేనేజర్ శ్రీచేతన్ మాట్లాడుతూ బ్యాంకు వినియోగదారులకు సేవల పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ఏర్పాటు చేసిన అంబుడ్స్‌మెన్ వ్యవస్థ గురించి వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా వినియోగదారులు తన బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చని, సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి పోర్టల్‌లో ఫిర్యాదులు, నమోదు చేసుకునే విధానం గురించి వివరించారు. కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, హెచ్‌వోడీ సురేందర్ రెడ్డి, ఆర్‌బీఐ అధికారులు శ్రీనివాస రావు, ఆంజనేయులు, రామ్మూర్తి, భరత్, శేఖర్, లక్ష్మణ్‌రాజు, పరుష, ప్రతాప్, రామాంజనేయులు, ప్రకాష్, వీరేష్ ఉన్నారు.

ఫార్మసీ చట్టాలను అమలు చేయాలి

» తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ చట్టాలను పక్కాగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశానికి ఆయనతో పాటు యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు శరత్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఫార్మసిస్టులు గత 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హెల్త్ మినిస్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎంఈల వల్లనే నెరవేరిందన్నారు. ఫార్మసిస్టులు అని పిలిచే వారని, దాన్ని ఫార్మసీ ఆఫీసర్స్‌గా తమకు గుర్తింపునిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారం కోసం 1948, సెక్షన్ 42 చట్టాన్ని తీసుకొచ్చారని, దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని అన్నారు. బస్తీ దవాఖానాల్లో, పల్లె దవాఖానాల్లో ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని, డీపీఎల్‌ఎంలలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని, ప్రతీ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో, ఫార్మసీ స్టోర్స్‌లలో రెగ్యులర్ ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా జిల్లాలోని టీచింగ్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న ఫార్మసీ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి యాదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశోక్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి రాఘవేందర్, ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూలపల్లి అటవీలో మొక్కలు నాటిన కన్జర్వేటర్ రాంబాబు


మొక్కలు నాటుతున్న జోగులాంబ జోన్ కన్జర్వేటర్ రాంబాబు

మహమ్మదాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూలపల్లి అటవీ ప్రాంతంలోని 187,188 సర్వే నెంబర్‌లలో వనమహోత్సవంలో భాగంగా గురువారం జోగులాంబ గద్వాల జోన్ కన్జర్వేటర్ ఎస్.రాంబాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. జూలపల్లి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు అన్ని విధాల అనువైన స్థలం ఉందన్నారు. ఆయన వెంట డీఎఫ్‌వో సత్యనారాయణ, మహమ్మదాబాద్ రేంజర్ అబ్దుల్‌హాయ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

» కాపాడిన పోలీసులు

అయిజ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు, అతడికి నచ్చచెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రంగస్వామి గురువారం ఉదయం తల్లిదండ్రులతో గొడవపడి సాయంత్రం అయిజకు చేరుకున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకోవాలని పురుగుల మందు కొనుగోలు చేసి, ఓ రెస్టారెంట్ వెనుకనున్న ముళ్లపొదల వైపు వెళ్లాడు. సోదరుడు వినోద్‌కుమార్‌కు వీడియో కాల్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో అతడు వెంటనే 100కు ఫోన్ చేసి చెప్పడంతో, డ్యూటీలో ఉన్న పోలీసులు రవి, రమణలు ఎస్ఐకి సమాచారం అందించారు. ఆయన లోకేషన్ తెలుసుకొని, రంగస్వామిని కలిసి మాట్లాడారు. ఆయనకు నచ్చచెప్పి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వానొచ్చె.. వరదొచ్చె..

» చెరువులను తలపించిన రహదారులు

» వర్షపు నీటితో స్తంభించిన ట్రాఫిక్

» ఇబ్బందులు పడ్డ ప్రజలు, విద్యార్థులు

మహబూబ్‌నగర్/జడ్చర్ల/భూత్పూర్/కందనూలు/వనపర్తి/మన్ననూర్/నారాయణపేట/కృష్ణ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గంటపాటు కుండపోతలా వర్షం కురిసింది. ఎటు చూసినా వర్షపు నీటితో పాలమూరు జలమయమైంది. గురువారం ఉదయం నుంచి విపరీతంగా ఎండకాసింది. ఎండకు తోడు ఉక్కపోతతో జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. తీరా సాయంత్రం 5:30 గంటలకు ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మడంతో ముందుగానే చీకటిమయమైంది. 6 గంటలకు నెమ్మదిగా ప్రారంభమైన వాన ఒక్కసారిగా కుండపోతలా కురిసింది. నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల మీదుగా వరద ప్రవహించింది. రహదారులపై భారీగా వరదనీరు చేరింది. మరో అరగంట కురిసి ఉంటే ఇళ్లలోకి కూడా నీరు చేరేది. వర్షానికి గడియారం చౌరస్తా, న్యూటౌన్, పాన్‌చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, శనివారం రాఖీ పౌర్ణమి ఉండటంతో గడియారం చౌరస్తా, పాన్‌చౌరస్తాలో జనాల రద్దీ పెరిగింది. అదే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్ జామ్ అయింది.

ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులు

జడ్చర్ల పట్టణంలో గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికి నేతాజి చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి ఎస్ఎల్ఎన్ ఆటోమోబైల్, రాఘవేందర్ వరల్డ్, అమరకృష్ణలాడ్జ్, శ్రీకృష్ణవెల్డింగ్ వర్క్, మనప్పురం బ్యాంకు, వాసవి టిఫిన్‌సెంటర్, వెంకటరమణ థియేటర్ ముందర పెద్ద ఎత్తున వర్షపునీరు చేరుకున్నది. అప్పుడే పాఠశాలలు వదిలిపెట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు వాహనాలు నీటిలో ఆగిపోయాయి. బస్సులు వెళ్లలేని స్థితిలో వర్షపునీరు చేరుకోవడంతో చాలాసేపు వాహనాలను రోడ్డుపై నిలిపే పరిస్థితి నెలకొంది. భూత్పూర్‌లో.. సాయంత్రం 5:45గంటలకు ప్రారంభమైన వర్షం గంట పాటు దంచి కొట్టింది. భూత్పూర్ చౌరస్తా ప్రాంతంలో భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు.


భూత్పూర్‌లో భారీ వర్షానికి వరద తాకిడి


ఏనుగొండ పోచమ్మకాలనీలో పారుతున్న వరద నీరు

కుమ్మెరలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుమ్మరి వీధిలో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుమ్మరి మధు, కుమ్మరి శేఖర్‌కు సంబంధించిన ఇళ్లల్లోకి వర్షం నీరు రావడంతో సామాన్లు, బియ్యం, జొన్నలు, నిత్యావసర వస్తువులు, బట్టలు, పేపర్లు అన్ని తడిసిముద్దయ్యాయి.

మోస్తరు వర్షం

వనపర్తి జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పెబ్బేరు మండలంలో అత్యధికంగా30.2 మి. మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జామున వరకు శ్రీరంగాపూర్‌లో 24.2, పెద్దమందడిలో 10.0, వీపనగండ్లలో 7.8, గోపాల్‌పేటలో 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

నల్లమలలో..

నల్లమల ప్రాంతంలోని మన్ననూరు, మాచారం, తుర్కపల్లి, ప్రశాంత్‌నగర్, అప్పాపూర్, పర్హాబాద్, మల్లాపూర్ పెంటల్లో గురువారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దుర్వాసుల చెరువు, చింతల చెరువు, ధర్మసముద్రం, చెరువుల్లోకి నీరు చేరింది. మాచారం చెరువు అలుగు పారింది.

పేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలోని నాలుగు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా నారాయణపేట మండలంలో 18.0 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా దామరగిద్ద మండలంలో 0.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 11 మి.మీ., కోస్గి మండలంలో 4.3 మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

ఉరుములు మెరుపులతో...

కృష్ణ మండల కేంద్రంతో పాటు హిందూపూర్, తంగడిగి, ముడుమాల్ తదితర గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.


జడ్చర్లలో వర్షపునీటిలో బైక్‌ను తోసుకుంటూ వెళుతున్న వ్యక్తి

క్రైం కార్నర్

తేజేశ్వర్ హత్య కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

గద్వాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో నిందితులకు మరో 14 రోజులు రిమాండ్ పొడిగించారు. కేసుకు సంబంధించి ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ కేసులో నిందితులుగా ఉన్న 8 మందిలో పోలీసులు 4 గురిని 4 రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఏ1 తిరుమల్‌రావు, ఏ2 ఐశ్వర్యలను కస్టడీలోకి తీసుకుని 3 రోజుల పాటు విచారించారు. తాజాగా మరో ముగ్గురు ఏ6 మోహన్, ఏ7 తిరుపతయ్య, ఏ8 సుజాతలను కూడా కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు పోలీసులు కోర్టుకు అప్పీలు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులను గురువారం జిల్లా కోర్టులో హాజరుపర్చగా, వారికి మరో 14 రోజుల పాటు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేయడంతో వారిని మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. ఏ6, ఏ7, ఏ8 నిందితులను పోలీసులు త్వరలోనే కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సంపులో పడి చిన్నారి మృతి


కీర్తి (ఫైల్)

మల్దకల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందున్న సంపులో పడి ఓ చిన్నారి మృతి చెందింది. మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రానికి చెందిన చెట్టుకింది తిమ్మప్ప, సరిత దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. గురువారం ఉదయం చిన్న కుమార్తె కీర్తి (2) ఇంటి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి సంపులో పడిపోయింది. ఆ సమయంలో తల్లి సరిత ఇంట్లో వంట చేస్తోంది. కాసేపటికి కూతురు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అనుమానంతో సంపులో చూడగా చిన్నారి మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు..

గద్వాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ పనులు చేస్తున్న ఓ కార్మికుడు అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీంనగర్ కాలనీలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డెవీధికి చెందిన వీరన్న(46) భీంనగర్‌లోని ఓ భవనంపై అంతస్తు నిర్మాణ పనికి భార్యతో కలిసి వెళ్లాడు. అక్కడ గోడకు ప్లాస్టరింగ్ చేస్తున్న అతడు అట్టడిపై నుంచి కిందకు దిగే సమయంలో జారి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని తోటి కూలీలు అతడిని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వీరన్నకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో వ్యక్తి మృతి

» దోషికి 3 నెలల జైలు శిక్ష

ఊర్కొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన దోషికి జైలుశిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించాడు. ఊర్కొండ ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా, త్రిపురారం మండలం, రేగడప గ్రామపరిధిలోని ఎస్లావత్ తండాకు చెందిన చరణ్‌సింగ్ 2019లో నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చెందాడు. సంఘటనపై అప్పటి ఎస్‌ఐ కృష్ణయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడు చరణ్‌సింగ్‌ను గురువారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. అతడిపై నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలుశిక్ష తో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుతదాడిలో ఆవుదూడ మృతి

ధరూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో చిరుత దాడి చేసి ఆవుదూడను చంపేసింది. స్థానికులు తెలిపిన వివరాలిలాఉన్నాయి.. గ్రామానికి చెందిన వెంకటప్ప బుధవారం సాయంత్రం తన పొలం వద్ద పశువులను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత దాడి చేసి ఆవుదూడను చంపేసింది. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన రైతుకు దూడ కళేబరం కనిపించింది. ఇలాంటి సంఘటనలు గ్రామంలో ఇప్పటికే ఐదు సార్లు సరిగాయని గ్రామస్థులు తెలిపారు. సంఘటనలపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

హత్య ఘటనలో ఐదుగురిపై కేసు

వెల్దండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన హత్య ఘటనలో ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పందుల చోరీ నేపథ్యంలో బుధవారం జరిగిన ఘర్షణలో కల్వకుర్తి పట్టణానికి చెందిన బెల్లంకొండ రాములు హత్యకు గురయ్యాడు. సంఘటనపై అతడి భార్య నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులు మానుపాటి వెంకటమ్మ, పెంటమ్మ, అన్వేశ్, శివ, పవన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పందుల చోరీపై..

కల్వకుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో జరిగిన పందుల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన మానుపాటి రాంచంద్రికి చెందిన 14 పందులు ఈ నెల 3న చోరీకి గురయ్యాయి. వాటిని మానుపాటి వెంకటమ్మ, ఆమె కుమారులు అన్వేష్, శివ, పవన్‌లతో పాటు వెల్దండ మండల కేంద్రానికి చెందిన రుద్రాక్షల కృష్ణ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

వ్యక్తిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

» పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

బ్రహ్మగిరి (దోమలపెంట), ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి) : సమస్య లను పరిష్కరించాలని కోరిన వ్యక్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి గ్రామానికి చెందిన బచ్చు శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చు శ్రీనివాసులు పలు సమస్యలను ప్రస్తావించారు.

ఆంధ్ర ప్రాంతంలోని లింగాల గట్టు ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద స్థానికుల నుంచి టోల్‌ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. బ్రహ్మగిరితో పాటు, కృష్ణగిరి, పాతాళగంగ వాసులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని అతడు కోరుతుండగా, కాంగ్రెస్ కార్యకర్తలు మోయజొద్దీన్, గురువయ్య, మునీర్ దుర్భాషలాడుతూ అతడిపై దాడి చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ముగ్గురు పిల్లలు సహా తల్లి అదృశ్యం

చిన్నచింతకుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలు సహా తల్లి అదృశ్యమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... నర్వ మండలం పెద్దకడుమూరు గ్రామానికి చెందిన రేజెట్టి పూజ, తన ముగ్గురు పిల్లలు దీపిక, ఆదిత్య, నందులతో కలిసి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య నెల కొన్న గొడవలే వీరు అదృశ్యం అవడానికి కారణమని తెలుస్తోంది. అయితే ఆమె భర్త చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన బోయ నాగముని తన భార్యాపిల్లలు కన్పించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు.

ఉద్యాన వరం..


కోడేరు మండలం జనుంపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన తోటలో ఆయిల్ పామ్ గెలలు



» పండ్ల తోటల పెంపకానికి అనువైన ప్రాంతం కొల్లాపూర్
» నియోజకవర్గంలో 37 వేల ఎకరాల్లో మామిడి సాగు
» 3 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు
» 400 ఎకరాలలో బత్తాయి, జామ

కొల్లాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం ఉద్యాన పంటలకు వరంగా మారింది. పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ పెంపకానికి ఈ ప్రాంతం అనువైనదిగా గుర్తించిన ఉద్యానవన శాఖ స్థానిక రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ ప్రాంత రైతులు దశాబ్దాలుగా మామిడి తోటలను పెంచుతున్నారు. ఇక్కడి ఉత్పత్తి అయ్యే మామిడి పండ్లకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం నియోజకవర్గంలో 37 వేల ఎకరాలలో మామిడి తోటలున్నాయి. ఇటీవల కాలంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో ఇక్కడ దాదాపు 3 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. అలాగే బత్తాయి, నిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, బొప్పాయి, అరటి పండ్ల తోటలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు కూరగాయల సాగుకూ ఈ ప్రాంత రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈమధ్య కాలంలో రైతులు ఎక్సోటిక్ పంటలైన అవకాడో, మకడామీయా నట్ లాంటి పంటలను కూడా ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. రైతుల ఆసక్తి, ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తోంది.

సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)

ఈ పథకం ద్వారా ఉద్యాన పంటలపై ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. అందులో ముఖ్యంగా కొత్తగా నాటిన మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, అరటి, బొప్పాయి, అవకాడో వంటి పంటలపై సబ్సిడీ ఇస్తుంది. అంతే కాకుండా 30 నుంచి 40 సంవత్సరాల పైబడి కాపు లేని మామిడి తోటల పునరుద్ధరణకు ప్రోత్సహకాలు అందిస్తోంది. అలాగే మామిడి కాయల కోత అనంతరం చేపట్టాల్సిన ప్రాసెసింగ్ కోసం ప్యాక్ హౌస్ నిర్మాణానికి సహకరిస్తుంది. ఒక ప్యాక్ హౌస్ నిర్మాణానికి అయ్యే రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అవకాశం కల్పిస్తోంది. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఒక హెక్టార్ ప్లాస్టిక్ మల్చింగ్ యూనిట్ వ్యయం రూ. 40 వేలు అయితే, అందులో 50 శాతం సబ్సిడీ ఇస్తోంది. వేసవిలో ఉద్యాన పంటల కోసం నీటి కుంటల నిర్మాణానికి కూడా ఈ పథకంలో చోటు కల్పించారు. అందులో భాగంగా 20/20/3 మీటర్ల నీటి కుంట నిర్మాణానికి రూ. 1.50 లక్షలు ఖర్చు అవుతోంది. అందులో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీగా రూ. 75 వేలు అందిస్తుంది. ఈ కుంట నీటి నిల్వ సామర్థ్యం 8.40 లక్షల లీటర్లు కావడంతో వేసవిలో నీటి ఎద్దడి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై)

ఈ పథకంలో భాగంగా తీగ జాతి కూరగాయల సాగుకు పందిరి నిర్మాణానికి ప్రోత్సాహకం అందిస్తోంది. అర్ధ ఎకరానికి ఒక యూనిట్‌గా కూరగాయల పందిరుల ఏర్పాటుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. అందులో ప్రభుత్వం రూ.50 వేలు సబ్సిడీగా ఇస్తుంది. ఈ పందిరి విధానంలో తీగ జాతి కూరగాయలైన కాకర, బీర, సోర, పొట్లకాయ, దొండ తదితరాలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించే అవకాశం ఉంటుంది.

ఆయిల్ పామ్ సాగు విస్తరణ పథకం (ఎన్‌ఎంఈవో - ఓపీ)

దేశీయ అవసరాలకు సరిపడ నూనె ఉత్పత్తి కోసం ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం పోత్సాహకాలు అందిస్తోంది. ఆయిల్ పామ్ మొక్క రూ.193 కాగా, రైతులకు రూ. 20కే అందిస్తోంది. సన్న చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలక 100 శాతం సబ్సిడీపైన 5 ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. దీంతో పాటు పంట నిర్వహణకు, అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 చొప్పున 4 సంవత్సరాలకు గాను రూ. 16,800 ప్రోత్సాహకం అందిస్తుంది. మొత్తంగా ఒక ఎకరానికి రూ.50,981 ప్రోత్సాహకంగా ఇస్తోంది.

తెలంగాణ మైక్రో ఇరిగేషన్ పథకం (టీజీఎంఐపీ)

ఈ పథకంలో భాగంగా పండ్ల తోటలు, కూరగాయల సాగు చేసే రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రైతులకు సబ్సిడీపై అందిస్తారు. ఈ పథకంలో సన్న చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై పరికరాలను అందిస్తారు. 5 ఎకరాల పైబడి రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందిస్తారు. స్ప్రింక్లర్ యూనిట్‌ను 75 శాతం సబ్సిడీపై రైతులకు ఇస్తారు.

నేషనల్ బ్యాంబు మిషన్ (ఎన్‌బీఎం)

ఈ పథకం ద్వారా వెదురు సాగును ప్రోత్సహిస్తారు. భారత ప్రభుత్వం 2017లో నిబంధనలను మార్చి వెదురును కలపగా కాకుండా, గడ్డి జాతి రకంగా గుర్తించింది. దీంతో రైతులు వెదురును పెంచే వెసులుబాటు కలిగింది. అందుకు అనుగుణంగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2018లో నేషనల్ బ్యాంబు మిషన్‌ను ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా వెదురు సాగు చేసే రైతులకు బౌండరీ, బ్లాక్ ప్లాంటేషన్‌పై 50 శాతం సబ్సిడీ అందిస్తోంది.

ప్రస్తుతం నియోజకవర్గంలో దాదాపు 1500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క కొల్లాపూర్ మండలంలోనే 850 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ధయించింది.


ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పండ్ల తోటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగుతో లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. భవిష్యత్తులో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కొల్లాపూర్ నియోజకవర్గం పండ్ల తోటల పెంపకంలో ముందంజలో ఉంటుంది.

- డాక్టర్ ఎం.లక్ష్మణ్, మండల ఉద్యాన శాఖ అధికారి

సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి

» చేనేత కార్మికుల ఆందోళన
» చేనేత దినోత్సవ సభలో నిరసన


పేట గాంధీవిగ్రహం దగ్గర నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

నారాయణపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట గాంధీనగర్ సొసైటీలో సభ్యత్వం కల్పించి, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు ఆందోళన చేపట్టారు. చేనేత కార్మిక సంఘం (టీయూసీఐ) ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముందుగా పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టి, ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ కొనసాగుతున్న జాతీయ చేనేత దినోత్సవంలో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఆర్డీవో రాంచందర్, చేనేత జౌళిశాఖ అధికారుల సమక్షంలో ఆందోళనకు దిగడంతో అధికారులు వారితో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నచ్చచెప్పారు. అనంతరం వారు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, సమస్యలను వివరించారు. చేనేత సొసైటీతో పాటు జౌళిశాఖలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కాశీనాథ్, కెంచి నారాయణ మాట్లాడుతూ 1951లో ఏర్పాటైన నారాయణపేట చేనేత సహకార సంఘంలో 4,265 మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. గాంధీనగర్ కాలనీకి సొసైటీ తరఫున 100 ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. వాటి కోసం కార్మికుల నుంచి ప్రతీ నెల రూ. 5 చొప్పున ఒక్కొక్కరి వద్ద రూ.2,475 వసూలు చేశారని తెలిపారు. సొసైటీ, ప్రభుత్వం నిర్ణయించిన ధరను లబ్ధిదారులు 35 ఏళ్ల క్రితమే చెల్లించారని గుర్తు చేశారు. అయినా ఇప్పటివరకు ఆ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సొసైటీలో 72 మంది సభ్యులు మాత్రమే ఉన్నారని తెలిపారు. చేనేత కార్మికులందరికీ సభ్యత్వం కల్పించి, ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు ఇచ్చిన ఫలితం లేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, ప్రశాంత్, నరసింహ, చెన్నారెడ్డి, నర్సింహులు, నాగేందర్, మహేశ్, నందు, అంబదాస్, వెంకట్రావు, ప్రవీణ్, శంకర్, మహదేవ్, నర్సిరెడ్డి, బాలాజీ, అనిల్, రామకృష్ణ, నరేశ్, అమర్, అనిల్, వరప్రసాద్, శ్రీకాంత్, రాకేష్, జైపాల్ పాల్గొన్నారు.

నాయకుడు మారినా క్యాడర్ మారలే..

» మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అచ్చంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నుంచి గుర్తింపు పొంది, వివిధ పదవులను అనుభవించిన నాయకుడు పార్టీ మారినా, క్యాడర్ మారలేదని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధినేత కేసీఆర్, కేటీఆర్‌లు ఆదేశం మేరకు ఇక్కడి నాయకులతో మాట్లాడటానికి వచ్చినట్లు తెలిపారు. పార్టీ పటిష్టంగా ఉందని, ఎవరు పోయినా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం అన్నారు. పదవులను అనుభవించి, ప్రలోభాలకు తలొగ్గి పార్టీ మారడం సరైనది కాదన్నారు. కేసీఆర్ ఆదేశిస్తే ఒక సైనికుడిగా పని చేస్తామన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. మరో 10 రోజుల వ్యవధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీశ్‌రావ్ ఇక్కడికి వచ్చి కార్యకర్తలతో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అభిలాష్ రావు, మనోహర్, పర్వతాలు, రాజిరెడ్డి, సర్వయ్యయాదవ్, రవీందర్‌రావు, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మప్పస్వామి బ్రహ్మోత్సవాలు

» ఏటా శ్రావణమాసంలో ఉత్సవాలు ప్రారంభం
» పందిరి, పుట్టమన్ను పూజలతో కార్యక్రమాలు ప్రారంభం


కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయం ముందు పందిరి నిర్మాణం

అయిజ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో వెలసిన స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ ఏటా శ్రావణ మాసంలో మొదలయ్యే ఈ ఉత్సవాలను పట్టణ ప్రజలు అయిదు రోజులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. వందల ఏళ్లక్రితం వెలసిన స్వామివారికి అయిజ పట్టణ ప్రజలతో పాటూ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల ప్రజలు మొక్కులు చెల్లించి పూజలు చేసుకుంటారు. వారి మొక్కుబడుల ప్రకారం స్వామివారికి దాసాంగాలు సమర్పిస్తారు. ఎంతో ఘనంగా నిర్వహించే ఈ బ్రహోత్సవాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భజన భక్తులు భజనల్లో పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం కృష్ణ, తుంగభద్ర నదీ జలాలతో స్వామివారికి వేదపండితులు పుణ్యస్నానం చేయించారు. అనంతరం పందిరి, పుట్టమన్ను పూజలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ చేశారు. ఇదే రోజు అన్నవరం సత్యనారాయణ స్వామి రథంతో పాటూ, రాత్రికి చిన్నరథోత్సవం, ఉయ్యాల పూజలతో మొదటి రోజు కార్యక్రమాలకు ముగింపు పలుకుతారు.

పూజా కార్యక్రమాలు ఇలా....

స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం అభిషేక పూజతో మొదలై హోమం, మకర లగ్న కల్యాణంతో కార్యక్రమాలు ముగుస్తాయి. మూడవ రోజైన శనివారం అయిజ పట్టణంలోని కట్టకింద తిమ్మప్పస్వామి దేవాలయం నుంచి పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు మీదుగా పెద్ద ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. నాలుగవ రోజైన ఆదివారం ఉట్టి కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పాటూ, పట్టణ యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. అయిదవ రోజైన సోమవారం శ్రీదేవి భూదేవి సమేత కట్టకింద తిమ్మప్ప స్వామి వారికి చక్రస్నానంతో కార్యక్రమాలకు వేదపండితులు ముగింపు పలుకుతారు.

జోగుళాంబ సన్నిధిలో ఆర్‌బీఐ సీజీఎం


అమ్మవారి ఆలయం ముందు ఆర్‌బీఐ సీజీఎం సింగాల సుబ్బయ్య, మిత్రులు

అలంపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రాన్ని ఆర్‌బీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీజీఎం, లోకాయుక్త డాక్టర్ సింగాల సుబ్బయ్య గురువారం దర్శించుకున్నారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం చేయించారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన తదితర విశేష పూజలు చేయించారు. ఆయన వెంట పృథ్వీ ఫాల్గుణి, కిరణ్ జార్జ్ తదితరులున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇటిక్యాల, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంక్‌ల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు ఎస్‌సుబ్బయ్య అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జన సంరక్షణ క్యాంపెయిన్‌లో భాగంగా యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతీ ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష, అటల్ పెన్షన్ యోజన, బీమా పథకాలను వినిగించుకోవాలన్నారు. ఎల్‌డీఎం శ్రీవివాసారావు, పృథ్వీనాబార్డు డీడీఎం షణ్ముఖం, యూనియన్ బ్యాంక్ మేనేజరు సురేశ్, సలోమి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

2డే లీగ్‌లో అబ్దుల్‌రాఫె సెంచరీ


సెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2డే లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు 17 పరుగుల తేడాతో చీర్‌ఫుట్ జట్టుపై ఓడిపోయింది. హైదరాబాద్‌లోని అజీజ్ నగర్ శ్రీలహరి క్రికెట్ మైదానంలో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో చీర్‌ఫుల్ జట్టు 63 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 60.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 181 బంతుల్లో 14 ఫోర్లతో సెంచరీ(108) చేసి రాణించాడు. ఛత్రపతి 80 బంతుల్లో 9 ఫోర్లతో అర్ధసెంచరీ(55) చేశాడు. సెంచరీ సాధించిన అబ్దుల్‌రాఫెను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ లైన్‌మన్ సస్పెన్షన్

జడ్చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం ప్రదర్శించిన జడ్చర్ల లైన్‌మన్ మధుసూదన్‌ను డీఈ చంద్రమౌళి గురువారం సస్పెండ్ చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని సరస్వతినగర్ కాలనీలో రెండు నెలల క్రితం విద్యుత్ షాక్‌కు గురై బాలుడు శ్రేయాంశ్ మృతి చెందిన సంఘటనపై పూర్తి విచారణ చేపట్టగా, లైన్‌మన్ అలసత్వమే కారణమని గుర్తించినట్లు తెలిపారు. మరికొంత విచారణ చేసి దీనికి బాధ్యులైన మరికొందరి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం

మిడ్జిల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేశారు. మిడ్జిల్‌కు చెందిన కమ్మరి లలిత అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.33,500 అందజేశారు. రామాంజనేయు, మక్బుల్, మాసుం బాబా, పాండు, ప్రకాష్‌గౌడ్, బాలగౌడ్, సునిత పాల్గొన్నారు.

రంగనాయక స్వామి ఆలయంలో పూజలు

జడ్చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దగుట్ట రంగనాయకస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ చైర్మన్ కాల్వ రాంరెడ్డి, రాధిక దంపతులు స్వాగతం పలికారు.

క్రిమిలేయర్‌ను రద్దు చేయాలి

పాలమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు నష్టం చేసే క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. గురువారం గోవాలో 10వ నేషనల్ కన్వెన్షనల్ రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్‌లో జిల్లా నుంచి పలువురు పాల్గొన్నారు. మహాసభలో బీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, జనరల్ సెక్రెటరీ రమ, బీసీ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ కృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులు యూరియా ఎక్కువగా వాడొద్దు



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏడీవో

మహమ్మదాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల యూరియా ఎక్కువగా వాడొద్దని ఏడీవో రాంపాల్ అన్నారు. గురువారం మండలంలోని మొకర్లబాద్‌లో వరి పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వరిలో కొనలు తుంచి నాటడంతో కాండం తొలిచే పురుగు రాకుండా కొంత వరకు నివారించవచ్చన్నారు. అనంతరం మండలంలోని ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఏవో నరేందర్, ఏఈవో నిఖిత పాల్గొన్నారు

పాఠశాలలో రాఖీ వేడుకలు



మొక్క నాటి రాఖీ కడుతున్న విద్యార్థులు

భూత్పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నాసాగర్, మద్దిగట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్నాసాగర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటి ఆ మొక్కలకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మద్దిగట్ల యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చక్రవర్తిగౌడ్, బాలరాజుగౌడ్, హెచ్ఎం శ్రీనివాసులు, జ్యోతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

జడ్చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. నులిపురుగుల దినోత్సవం, యూడైస్‌ప్లస్ నందు విద్యార్థుల నమోదు, ఎఫ్ఆర్ఎస్ అటెండెస్ త్వరలో నిర్వహించే మండలస్థాయి టీఎల్ఎం మేళాకు సిద్ధంగా ఉండాలని ఎంఈవో మంజులా దేవి ఉపాధ్యాయులకు సూచించారు. వివిధ రకాలైన ఆన్‌లైన్ పనుల గురించి వివరించారు. జడ్చర్ల అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుప్రియ, రూరల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, జగదీశ్వర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాసులు, లక్ష్మీ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మర్చిపోయారా?

జడ్చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు జీవో నెంబర్ 123ను రద్దుచేసి, 2013 చట్టాన్ని అమలు పరిచి పునరావాసం, పునర్నిర్మాణాన్ని తక్షణమే అమలు పరుస్తామని చెప్పి అధికారంలో వచ్చిన వారు ప్రజలకిచ్చిన మాటలు మార్చిపోయారా? అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉదండాపూర్ ముంపు బాధితులు, రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోతే ఆందోళన చేపడుతామన్నారు.

కాలానికనుగుణంగా..
డిజైన్లు రూపొందించాలి

» కలెక్టర్ విజయేందిర బోయి
» ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత సంఘాలకు రూ.11,48,800 చెక్కు అందజేస్తున్న కలెక్టర్



జాతీయ చేనేత దినోత్సవం ర్యాలీలో పాల్గొన్న అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికనుణంగా చేనేత డిజైన్లు రూపొందించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా గద్వాల, నారాయణపేట, అమరచింత, కొత్తకోట చేనేత వస్త్రాలకు ప్రసిద్ధిగాంచినట్లు ఆమె తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కంబళ్లను, షాల్స్‌ను తయారు చేస్తున్నారని, జిల్లాను కూడా చేనేత ఉత్పత్తుల్లో ప్రముఖంగా నిలిపేలా కొత్త డిజైన్లతో వస్త్రాలు తయారు చేయాలన్నారు. చేనేత కార్మికుల తయారు చేసిన వస్త్రాలు వారానికోసారి ధరించాలన్నారు. చేనేత వస్త్రాలు కొనవడంతో చేనేత కార్మికులకు ప్రోత్సాహం ఉపాధి లభిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహరెడ్డి మాట్లాడుతూ చేనేత వృత్తి కాదు ఒక గొప్ప కళ అన్నారు. ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి నేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి, నేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలన్నారు. 16 మంది సీనియర్ నేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన, వృక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం నేతన్న పొదుపు, భద్రత కింద రూ.11,48,800 చెక్కును చేనేత సంఘాలకు అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ గేటు నుంచి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో చేనేత స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జెడ్పీ సీఈవో వెంకటొరెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీఆర్వో శ్రీనివాస్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎ స్సీ కార్పొరేషన్ ఈవో సంతోష్, చేనేత జౌళి శాఖ డీవో రాజేష్‌బాబు, ఏడీవో లావణ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే సత్తా ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరంకు మాత్రమే ఉందని ఆ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు రాజసింహుడు, రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు చనిపోతే దహన సంస్కారాలకు ఇచ్చే రూ.5 వేలను రూ.20 వేలకు తదుపరి రూ.30 వేలకు పెంచేలా చేసిందన్నారు. జీవితకాలపు స్మార్ట్ ఐడెంటిటీ కార్డులను, ఆయా జిల్లాలోని విశ్రాంత ఉద్యోగుల ముఖ చిత్రాలను స్థానిక ఆర్టీసీ క్లినిక్‌లలోని కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే విధానాన్ని యాజమాన్యం చేత ప్రవేశ పెట్టించింది తమ ఫోరమే అన్నారు. జిల్లాలోని రెండు ఆర్టీసీ క్లినిక్‌లలో డాక్టర్ల నియమాకం, మందుల సరఫరా పెరుగుదల, కనీస పెన్షన్ పెంపుదలకై 8 సంవత్సరాలుగా నిరసనలు, ఆందోళనలు చేపట్టిందని వివరించారు. అనంతరం ఫోరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, అధ్యక్షుడిగా రాజసింహుడు, ఉపాధ్యక్షులుగా భగవంతు, జె.ఎస్.రెడ్డి, లలితమ్మ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అంజన్న, బషీరోద్దీన్, వెంకన్న, సహాయ కార్యదర్శులుగా మోహన్‌రెడ్డి, కెవిఎల్.డెవిడ్. జాహింగీర్, కోశాధికారిగా బుచ్చన్న, సలహాదారులుగా జీబీపాల్, ఉమేష్‌కుమార్, వెంకట్ నారాయణ, నాగాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రతీ ఒక్కరు చదువుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ ద్వారా చదువు మధ్యలో మానేసిన వారికి చదువుకునే అవకాశం ఉందని ప్రతీ ఒక్కరు చదువుకోవాలని మహబూబ్‌నగర్ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ రాజన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ సొసైటీకి సంబంధించిన పోస్టర్‌ను మెప్మా అధ్యక్షురాలు వరలక్ష్మితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

మిడ్జిల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో గీతాంజలితో తనిఖీ చేశారు. బియ్యం, పప్పులు, కూరగాయాలను పరిశీలించారు. వార్డెన్ వసంత పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఏమైనట్లు?

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీలో ధర్నా చేశారు. ఈ ధర్నాకు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే రాకపోవడం ఏంటని బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నవభారతి విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ కోసం చేసిన ధర్నాకు బీసీ ఎంపీలు రాకపోవడం ఏంటన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

హన్వాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. గురువారం హన్వాడలోని ప్రాథమిక వ్యవసాయ సేవ సంఘం ఎరువుల కొనుగోలు కేంద్రంలో రైతులకు సరాఫరా చేస్తున్న ఎరువులను పరిశీలించారు. రైతులకు సరిపడా ఎరువుర అందుబాటులో ఉన్నాయని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఓర్వలేక ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా నాయకుడు కృష్ణయ్య, మండల నాయకులు షబ్బీర్‌హుస్సేన్, ఆంజనేయులు, దాసరి వెంకటయ్య, యాదిరెడ్డి, అరేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆబాస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ వైద్య ఆరోగ్య శాఖలో (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్) ఉపసంహరించుకోవాలని క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు గురువారం డీఎంహెచ్‌వో కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలకు వెళ్లడానికి సరైన సౌకర్యాలు లేవని, దీంతో కొంత ఆలస్యం కావచ్చన్నారు. అంతేకాకుండా తమ శాఖలో 90 శాతం మంది మహిళా ఉద్యోగినులే ఉన్నారని, వారు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నైట్ డ్యూటీలు, డే డ్యూటీలు అదనంగా చేస్తున్నారని, అత్యవసర సమయంలో పనిచేసే ఉద్యోగులకు ఈ ఆబాస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

» రెండు బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులు, పట్టుబడిన దొంగ

కోయిలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా ఆలయాల్లో హుండీలు, బైక్‌లను దొంగతనం చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తిరుపాజీ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఇబ్రహీంనగర్‌కు చెందిన మనికొండ నరేష్ కొన్ని రోజుల నుంచి మండలంలోని ఆయా ఆలయాల్లో వరుసగా హుండీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. జూలై 23న మండలంలోని వాల్యానాయక్‌తండాలోని ఆంజనేయస్వామి ఆలయంలో తాళం పగలగొట్టి హుండీలో ఉన్న రూ.3 వేలతో పాటు 10 తులాల వెండిని దొంగిలించి, మద్యం తాగి జల్సా చేశాడు. జూలై 30న మండలంలోని రాజువ్ నాయక్ తండాలో కట్రావత్ శ్రీను నాయక్ చెందిన బైక్ ఇంటిలో పెట్టగా గేటు తాళం తీసి బైక్‌ను దొంగిలించాడు. ఆగస్టు 1న మండల కేంద్రంలోని పడెన్న దర్గా వద్ద సయ్యద్ ఇనియాత్ ఉల్లాకు చెందిన బైక్‌ను ఎత్తుకెళ్లాడు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిందితుడు నరేష్ బైక్‌తో వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



సభ్యత్వం చేయిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పీఆర్టీయూ పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని బోయపల్లి, అప్పన్నపల్లి, ఎదిర, ఏనుగొండ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. సెప్టెంబరు 1న నిర్వహించే మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. నాయకులు అతహార్ అహ్మద్, శశీధర్, పురుషోత్తంగౌడ్, శ్రీకాంత్, యాదయ్య, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బాబోయ్.. కుక్కలు

» గుంపులుగా తిరుగుతూ దాడి
» బెంబేలెత్తుతున్న చిన్నారులు, వృద్ధులు



పద్మావతికాలనీలో కుక్కల గుంపును బెదరగొడుతున్న స్థానికుడు

జడ్చర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నుంచి బయటికి అడుగు పెట్టాలంటూ బాబోయ్.. కుక్కలు అంటూ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కాలనీల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్న సంఘటనలు జడ్చర్ల మునిసిపాలిటీలో చోటుచేసుకుంటున్నాయి. మునిసిపాలిటీలోని ఏ వార్డులో చూసినా కుక్కలు గుంపు కనబడుతోంది. కాలనీలో ఒంటిరిగా వెళ్లాలంటేనే కాలనీవాసులు జంకుతున్నారు. గత సీజన్‌లో మునిసిపాలిటీలో దాదాపు 1000కి పైగా కుక్కలు ఉండగా, వాటిలో కొన్నింటిని పట్టి, ఇతర ప్రాంతాలకు తరలించారు. నేడు మునిసిపాలిటీలో గుంపులుగా ఉన్న కుక్కలను లెక్కిస్తే 1000కిపై గానే ఉంటాయని పట్టణ ప్రజలు అంటున్నారు. ఉదయం వేళ స్కూల్ బస్సులకు కోసం కాలనీల్లో విద్యార్థులు వేచి ఉంటున్న సందర్భంలో కుక్కల గుంపును చూసిన విద్యార్థులు భయప డుతున్నారు. నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే దారిలో గౌరీశంకర్‌కాలనీలోకి వెళ్లే దారిలో సోమవారం రాత్రి పది కుక్కలున్న గుంపు ఓ ద్విచక్రవాహన చోదకుడిపైకి వచ్చాయి. చాకచ క్యంగా అతడు తప్పించుకోవడంతో పెద్ద ప్రమా దం తప్పిందని స్థానికులు తెలిపారు. పట్టణంలోని పద్మావతి కాలనీలో సైతం గుంపులు, గుంపులుగా ఉన్న కుక్కలతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. గుంపుగా ఉన్న కుక్కలు ఓ పాదచారుడిపై దాడికి ప్రయత్నించగా స్థానికులు బెదిరించడంతో పారిపోయాయి. మునిసిపాలిటీ లో నెలకొన్న కుక్కల బారి నుంచి రక్షించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వరలక్ష్మి వ్రతం ఎఫెక్ట్

» బంతిపూలు కిలో రూ.200 » మల్లె పూలు మూర రూ.50

మహబూబ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసంతో పాటు శుక్రవారం వరలక్ష్మి కావడంతో పూల ధరలు రెండింతలయ్యాయి. పాలమూరు మార్కెట్‌లో గురువారం పూల ధరలకు రెక్కలొచ్చాయి. కిలో బంతిపూలు రూ.200 కాగా, మల్లెపూలు మూర రూ.50 పలికింది. మొగిలిరేకుల ధర రూ.70 కాగా, కమలం పువ్వు ఒకటి రూ.70గా విక్రయించారు. అరటిపండ్ల డజన్ రూ.65 నుంచి 75కు పెంచేశారు. రూ.20 ఉన్న కొబ్బరికాయల ధర రూ.35 నుంచి 40 వరకు పెరిగింది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నగరంలోని గడియారం చౌరస్తా, పాన్‌చౌరస్తా కిటకిటలాడింది. పూలు, పండ్ల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

భారీ వర్షాలున్నాయ్.. ప్రజలను అప్రమత్తం చేయండి

» పోలీసులతో ఎస్పీ జానకి అత్యవసర టెలీ కాన్ఫరెన్స్

మహబూబ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ జానకి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలో భారీ వర్షం కురవడం, మరో రెండు రోజులు వర్షాలు ఉండే అవకాశం ఉండటంతో ఎస్పీ రాత్రి అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధిక వర్షాల కారణంగా వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న వాగులు, వంకలు, వంతెనలు, చెరువుల వద్ద వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సందర్శించాలన్నారు. పాత ఇళ్లల్లో జనాలు నివాసం ఉండకూడదని, అలాంటి వారిని పునరావాస కేంద్రాలకు తరలించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. పెట్రోల్ మొబైల్ వాహనాలు రాత్రంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితిలో డయల్ 100కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్షరాస్యత పెంచడానికే ఉల్లాస్ : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడుతోందని డీఈవో ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ కార్యక్రమంపై మండల రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పేందుకు ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందుకోసం గ్రామాల్లో స్వచ్ఛందంగా వలంటీర్లు బోధన చేయాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కీలకమని వయోజన విద్యా జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11వ తేదీలోపు గ్రామంలోని నిరక్షరాసులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. మండల స్థాయి రిసోర్స్ పర్సన్లు తమ మండలాల్లోని టీచర్లకు అక్షర వికాసం పుస్తకంపై శిక్షణ ఇవ్వాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ రవి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనల మేరకు విద్యార్థుల విరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎడ్ కళాశాల గాంధీ మీటింగ్ హాల్‌లో ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్‌తో విద్యార్థులకు సంబంధించి అపార్, యుడైస్ ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమానికి ఎమ్మెల్యేల మద్దతు



పోస్టుకార్డులపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : భారత కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫొటో ఉండాలని చేస్తున్న పోస్ట్ కార్డు ఉద్యమానికి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి మద్దతు తెలిపారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పోస్టు కార్డు ఉద్యమానికి మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. కులమతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని అందించి, వారి హక్కులను వారికి అందించి దేశానికి దిశానిర్దేశం చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీపై ఉంచాలని కోరారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

పాలమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా 23వ మహా సభలను ప్రజల సహకారంతో విజయవంతమైందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, పీయూ అనుబంధంగా అగ్రికల్చర్ కోర్సులు ప్రవేశపెట్టాలని, మాచర్ల నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వెంటనే కేంద్రంతో ఒప్పించి నిర్మాణం చేపట్టాలన్నారు.

రెండోసారి జిల్లా కార్యదర్శిగా బాలకిషన్

సీపీఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బి.బాలకిషన్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా పరమేష్‌గౌడ్, కొండపల్లి రాము, సురేష్, బాగి కృష్ణయ్య, అల్వాల్‌రెడ్డి, గోవర్దన్, పద్మ ఎన్నికయ్యారు.


తల్లిపాలు ఆరోగ్యదాయకం

కోయిలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యదాయకమని ఎంపీడీవో కాళప్ప సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. ఏంపీవో రాజేశ్వరెడ్డి, డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రత్నమాల, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నివారణ మాత్రలు తప్పని సరి

మిడ్జిల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సీహెచ్‌వో అయుబ్‌ఖాన్ తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శివకాంత్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై వివరించారు. మండలంలోని 5230 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.

జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలి



పీయూ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ గురించి నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలను జీవో నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు గురువారం పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల ముఖ్య నాయకులు సత్యంగౌడ్, సూర్య, అభిషేక్, సంతోష్, రాఘు, భరత్ పాల్గొన్నారు.